# ఊతం

"టక్, టక్, టక్, టక్......" చేతికర్ర తాటించుకుంటూ కోవెలకు బయలు దేరింది పార్వతమ్మ.

ఆమె చేతికర్ర తాటింపులకు మనవడు కృష్ణారావు గుండెలో గుబులు మొదలయింది. బామ్మకెలా చెప్పాలి? ఆమె కర్ర తాటింపు చాటింపులా 'నువ్వు చేసేది న్యాయం కాదురా!' అన్నట్టు విన్పించింది అతనికి. తన వివశత తనకు తెల్సు. కానీ తప్పదు. అయితే అనుకోని కోణంలో నుండి అతనికి సాయం లభించింది. అతడి చిన్న తమ్ముడు బుజ్జి విన్నాడు బామ్మ వెళ్ళిపోవాలన్న నిర్ణయం. వాడప్పుడు నైన్త్ క్లాసు చదువుతున్నాడు. వాడికీ అమె వెళ్ళిపోవటం ఇష్టంలేదు. కానీ తన మాటెవరూ వినరు. అందుకని ఆమె చేతే ప్రతిఘటింప చేసే ప్రయత్నంలో, "బామ్మా" అని పిల్చాడు.

ఆమె వెనక్కి తిరిగి చూసింది. మనవడు పరుగెత్తుకుంటూ తన దగ్గరకు వస్తూవుంటే, "నువ్వూ వస్తావా కోవెలకు? రా వెళ్దాం" అంది ఆమె.

బుజ్జిని వెంటపెట్టుకుని కోవెలకు వెళ్ళటం ఆమెకు మామూలే.

వాడు దగ్గరకు వచ్చి, "కాదు, బామ్మా! నువ్వు వెళ్ళిపోవాలంట!"అని చెప్పాడు.

"ఎక్కడికిరా?"

"విజయక్క వాళ్ళింటికి, బెజవాడ వెళ్ళాలంట!"

"ఎవరు చెప్పారు?"

"మరి పిన్నమ్మ ఎందుకు వచ్చిందనుకున్నా? నిన్ను తీసుకెళ్ళటానికే?"

ఆమె కర్థమయినట్లుంది. ఓ క్షణం నిశ్చేష్టురాలయింది. మాట్లాడలేదు.

అటుగా పెద్ద మనవడు పోతూంటే, "కిష్టదూ!"అని పిలచింది.

"ఏంటి బామ్మా!" అంటూ సందేహిస్తూనే వచ్చాడు కృష్ణారావు.

"నన్ను పంపేస్తున్నావటరా? నాకింత తిండి పెట్టటం కష్టమయిందటరా నీకు?" అనడిగింది బామ్మ.

"అది కాదు, బామ్మా, మరే...." అని కృష్ణారావు చెప్ప లేక నీళ్ళు నమిలాడు.

నిజానికి అతన్ని అపరాధ భావన కుంగదీసింది. ఆమెకు తను పెట్టటం కాదు, ఆమే తనకు తిండి పెడుతోంది. ఆమె మూడు ఎకరాల్లో పండిన పంటతోనే ప్రస్తుతం తమ బతుకు వెళ్ళమారి పోతున్నది. ఆమెను ఇంటి నుండి పంపెయ్యాలన్న నిర్ణయం తనకు ప్రాణఘాతకంగా వుంది. ఆమె ఆ ఇంటి మనిషిలాగానే ఎప్పుడూ ప్రవర్తించింది. తనకు ఆస్తి ఉందన్న స్పృహ కూడా ఎప్పుడూ ఆమెకుండేది కాదు. ఆమెకింద తను పైస ఖర్చు పెట్టాల్సిన పనిలేదు. ఎప్పుడూ తన్ను పైస ఇవ్వమని అడిగిన పాపాన పోయిన మనిషి కాదు ఆమె. ఈ వయసులోనూ జిర్రున చీదెరగదు. తనేదో తెనాలిలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నా, తను బతుకుతున్నది మాత్రం ఆమె పొలం మీద వచ్చిన అయివేజుతోనే. నాయనమ్మ, తల్లి, తమ్ముడు, భార్య, ఇద్దరు పిల్లలతో సంసారం ఈదటం తనకు కష్టంగానే ఉంది.

అతనేం సమాధానం చెప్పలేక సందిగ్ధంలో పడినప్పుడు, అతని పెద్ద అక్క వచ్చింది, ఆపద్బాంధవిలా.

"తప్పేం! వీడు ఎట్లా నీకు మనవడో, విజయ అట్లా నీ మనవరాలు కాదూ? నాలుగు రోజులు అక్కడావుండు, దానికీ తెలిసి వస్తుంది. నాన్న పోయాక పదేళ్ళబట్టీ ఇక్కడే ఉంటున్నావా, ఒక్క సారయినా పిన్ని నిన్నుతీసుకు వెళ్తానన్నదీ? ఇవాళ తగుదునమ్మా అని ఆస్తి పంచి ఇవ్వమని అడగటానికి వచ్చింది! చెయ్యటానికి మేమూ, ఆస్తి అనుభవించటానికి అదీనా?" అంది గట్టిగా ఇందిర.

బామ్మేం మాట్లాడలేక పోయింది. ఆమెకు తొంబై ఆరేళ్ళు. ఎప్పుడో తన పదకొండేళ్ళప్పుడు ఆ ఇంటికి కాపురానికి వచ్చింది పార్వతమ్మ. 'ఇప్పుడు తన మనమరాలు ఆ ఇల్లు తనది కాదంటోంది.'

ఆమె ఏం మాట్లాడలేదు.

తనకు సాయంకాలం కోవెలకు వెళ్ళే సమయమయింది. చేతి కర్ర తాటించుకుంటూ వెళ్ళిపోయింది. ఆ 'టక్ టక్' చప్పుడులు తన అంతరాత్మపై సమ్మెట పోటులా అనుభూతమయాయి కృష్ణారావుకు.

అసలిదంతా ఎందుకు వచ్చిందంటే....

పార్వతమ్మకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. భర్త పోయినప్పటి నుండి ఆమె తన పెద్ద కొడుకు, రఘురామయ్య దగ్గరే ఉండేది. తన మొగుడు పోయినా ఆమె మాటకు ఆ ఇంట్లో ఎదురుండేది కాదు. ఆమెనడిగే కొడుకు ఏ పనయినా చేసేవాడు. ఆయన పిల్లలు కూడా పెరిగి పెద్దవటం, వాళ్ళపెళ్ళిళ్ళూ, పురుళ్ళూ, పుణ్యాలతోపాటు, మెల్లగా అధికారాలు కూడా మార సాగాయి. తన తల్లి తర్వాత పెద్దకూతురు మాటలు రఘురామయ్యకు నచ్చేవి. ఆమెకు పెళ్ళయి కాపురానికి వెళ్ళినా, ఇంటికి సంబంధించిన ఏ ముఖ్య నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినా, ఆయన తన పెద్ద కూతురు ఇందిరని పిలవనంపేవాడు. ఆయన పోయి పదేళ్ళయినా అదే ఆనవాయితీ కొనసాగింది. పార్వతమ్మ కూడ ఆధ్యాత్మిక చింతన అధికమవటంతో ప్రాపంచిక విషయాలను పట్టించుకోటం మానేసింది. రెండ్రోజుల క్రితం కృష్ణారావుపిన్ని- బాబాయి భార్య సుందరమ్మ- వచ్చి అతనితో తన అత్తకున్న ఆస్తిలో వాటా పెట్టమని పేచీ పెట్టటంతో, మళ్ళా ఆ ఇంటిపెద్దక్క ఇందిర రంగ ప్రవేశం చేసింది.

ఆ పాత కాలంలో రఘురామయ్య, తమ్ముడు రాజారావూ ఎంతో సఖ్యంగా ఉండేవాళ్ళు. తండ్రి పోయాక, ఆయన ఆస్తి పంచుకునేటప్పుడు, తల్లికి కూడా మూడెకరాలు కేటాయించారు. రాజారావు ఉద్యోగస్థుడు, అప్పుడు వినుకొండలో ఉండేవాడు. రఘురామయ్య ఊళ్ళోపెద్ద రైతు. తమ్ముడి పొలం కూడా ఆయనే సాగు చేయించేవాడు. తల్లి కిచ్చినమూడెకరాల భూమికూడా ఆయన సాగులోనే ఉండేది. ఆ పొలాన్ని ఆమె పేరున పెట్టాల్సిన అవసరం ఎవరికీ కనపడలేదు. పార్వతమ్మకయితే తనకు పొలమున్న దన్న ఆలోచనే ఉండేది కాదు. క్రమక్రమంగా ఆమె కొడుకులు పోయారు, కూతుళ్ళు ఒక్కొక్కళ్ళూ చనిపోయారు. "అందర్నీ మింగి నేను బతుకుతున్నాన"ని ఏడ్చేది ఆమె.

పెద్ద కొడుకు పోతేనేం, అది తన ఇల్లే. ఇప్పుడు పెద్ద మనవడి అధీనంలో ఉంది. రఘురామయ్య కంటే రాజారావు ముందు చనిపోయాడు. రఘురామయ్య పోయిన పదేళ్ళకు రాజారావు భార్య, సుందరమ్మ, వచ్చి తన అత్త పేర నున్నపొలంలో తనకు అంటే తన కూతురు విజయకు ఎకరన్నర రావాలని అడగటం మొదలెట్టింది. ఆమెకున్నది ఒక్కతే కూతురు. అల్లుడు మంచి ఉద్యోగం చేస్తున్నాడు. భర్త పోయాక దుగ్గిరాలలో ఉన్న పొలంకూడా అమ్మేసి, ఆ డబ్బు కూడ అల్లుడి చేత బెట్టింది సుందరమ్మ. ఈ ఎకరన్నర మీద ఆధార పడి బతకాల్సిన అవసరం వాళ్ళకు లేదు. నిజానికి రఘురామయ్య పోయాక ఇబ్బందుల్లో పడింది ఆయన కుటుంబమే. పిల్లలు ఎక్కి వచ్చే సరికి తనిచ్చే ఆస్తి వాళ్ళు బతకటానికి ఏమీ సరిపోదని ఆయనకు తెల్సు. అందుకే, కొంతమంది మిత్రులతో కల్సి చెరకు ఫ్యాక్టరీ పెట్టాడు. అందుకు అప్పులు కూడా చేశాడు. ఆయన బతికి ఉంటే అన్నీ

సక్రమంగా జరిగి ఉండేవేమో కానీ, ఆయన అర్థాంతరంగా చనిపోయేటప్పటికి, వాటాదార్లు నష్టాలు చూపి మోసం చేశారు, అప్పుల వాళ్ళు బాకీలు తీర్చాలని లగాలగీ చేయటంతో, ఉన్న పొలం అమ్మి కృష్ణారావు బీద రైతయిపోయాడు.

తండ్రి బతికి ఉన్నప్పుడు అతను ఇంటి విషయాలేవీ పట్టించుకునేవాడు కాదు. తెనాలిలో బి.ఏ చదివే రోజుల్లో వామ పక్ష భావాలు అలవర్చుకున్నాడు. కమ్యూనిష్టు ఉద్యమంలో పనిచేశాడు. తండ్రి ఊళ్ళో పెద్ద రైతు. రఘురామయ్యా కొడుక్కు ఉద్యోగం చూసుకోమని చెప్పలేదు. కృష్ణారావూ తను ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఉందని భావించలేదు. అయితే, అతని తమ్ముడు వెంకటేశ్వర్లు అన్నలాంటివాడు కాదు. తనూ గ్రాడ్యుయేషన్ పూర్తి చెయ్యటంతోనే, ఎల్లైసీ ఆఫీసులో ఉద్యోగం సంపాదించాడు. అతన్ని బందరులో పోష్టు చేశారు. తండ్రి బతికున్నప్పుడే అంతంత మాత్రంగా ఇంటి కొచ్చేవాడు. ఆయన పోయాక ఇంటికి రావటమే ఘానేశాడు. తండ్రి పోయాక గానీ, కృష్ణారావుకు లోకం తీరు తెలిసి రాలేదు. పెద్ద కొడుకుగా తన బాధ్యతలను కాదనుకోలేక పోయాడు. తమ్ముడు ఇంటి విషయాలు పట్టించుకోలేదు. తను సాయమూ చెయ్యడు, సాయమూ అడగడు. ఎప్పుడో చుట్టంచూపుగా రావటం తప్ప, సాధారణంగా రాడు. చిన్న తమ్ముడు బుజ్జి ఇంకా చదువుకుంటున్నాడు. చెల్లెళ్ళిద్దరూ ఒకరు విశాఖపట్నంలోనూ, మరొకరు బొంబాయిలోనూ వాళ్ళ భర్తల దగ్గర ఉంటున్నారు. అప్పటికి, ఆ కుటుంబానికున్న ఆధారం బామ్మకున్న ఆ మూడెకరాలే. జీవితం వెళ్ళమారటం కష్టమయాక అతడు తెనాలిలో ఓ ప్రైవేటుకంపెనీలో ఉద్యోగం చూసుకున్నాడు. అందులో వచ్చే జీతమూ సరిపోయేది కాదు.

సుందరమ్మ విజయవాడ నుండి దుగ్గిరాల వచ్చి, తన ప్రతిపాదన చేశాక కృష్ణారావేం మాట్లాడ లేక పోయాడు. ఆమెకోరిక సమంజసమే. అయితే, ఎకరన్నర పొలం ఆమెకిచ్చేస్తే తన బతుకు దుర్భరమవుతుంది. కష్టం మీద గడుపుకొస్తున్నవాడికి బతకటమే కష్టమవుతుంది.

ఈ విషయంకొత్తదేమీ కాదు. సంవత్సరం బట్టీ సుందరమ్మ వచ్చి తన వంతు ఆస్తి ఇవ్వాలని అడుగుతూనే ఉంది. నిజానికి ఇంత ప్రమాదం కొని తెచ్చుకున్నది కృష్ణారావే. రఘురామయ్య తను బతికి ఉన్నప్పుడే, తమ్ముడు పోయాక, మరదలు ఊళ్ళో పొలం అమ్ముకు పోయిన తర్వాత, తమ్ముడి కూతురికి సాయమన్నట్టు సంవత్సరానికి సరిపడా ధాన్యం, మరకూడ పట్టించి బియ్యం విజయవాడ పంపేవాడు. ఆ ఆనవాయితీ తండ్రి పోయాకకూడ కొన సాగించాడు కృష్ణారావు. అయితే, ఆస్తి అంతా అప్పులకింద హారతి కర్పూరమయి పోయాక, తమకే గడవటం కష్టమై ఎప్పటిలా బియ్యం పంపలేక పోయేసరికి, అతని పినతల్లి సుందరమ్మ అతనికి 'బామ్మ పొలంలో పండిన పంటలో విజయ వాటా

సగం పంప వల్సిందని ఉత్తరం రాసింది. అప్పటికే గొంతు లోతు కష్టాల్లో ఉన్న అతను 'ఈ యేడు వెసులు బాటు కాలేదు, పిన్నీ! వచ్చే యేడు పంపే ప్రయత్నం చేస్తాను' అని అందుకు సమాధానం రాశాడు. అలా ఆమెకు తన హక్కు విషయమై గట్టిగా అడిగేందుకు ఆస్కార మిచ్చాడు.

ఈ విషయాన్ని అక్క ఇందిరతో ప్రస్తావించినప్పుడు, "ఈ గోలంతా ఎందుకురా, బామ్మ మూడెకరాలూ కూడా అమ్మెయ్య రాదూ? ఇంక ఆమె అడిగే ప్రశ్న ఉండదు" అంది.

"బామ్మ పొలం మనమెలా అమ్మగలం? ఆవిడేం అమ్మమని చెప్పలేదు కదా?"

"వద్దులే. పిన్ని దగ్గర నాన్న వాళ్ళు పొలం పంచుకున్న పత్రాలున్నాయేమో?"

తరవాతి రెండేళ్ళూకూడా అతను బియ్యం పంపలేక పోయాడు. ఓసారి పనిమీద విజయవాడ వెళ్ళినప్పుడు సుందరమ్మ అతన్ని తిట్టింది, చెల్లెలి డబ్బు తింటున్నావని. అతనికీ కోపం వచ్చింది.

"బామ్మకు వేరే పొలం ఉన్నట్టు నాకు తెలీదు. నాన్న ఆనవాయితీనే కొనసాగించాను తప్ప, విజయ వాటా అని చెప్పి నేను బియ్యం పంప లేదు. ఇప్పుడు కుదరటం లేదు కనుక పంపలేదు. దానికి వేరే అర్థాలు తియ్యకు" అన్నాడతను.

"నువ్విప్పటిదాకా ధర్మంగా పోయే మనిషి వనుకున్నాను. సరే, అప్పుకింద మీ పొలమంతా అమ్మేశావు కదా? బాకీ లన్నీ తీరిపోయినట్టేనా?"

"లేదు పిన్నీ, ఇంకా కొన్ని ఉన్నాయి."

"మరి చెరువు కింద ఆ మూడెకరాలూ అమ్మలేదేం?"

"అమ్మ అమ్మొద్దంది. పొలం అంతా అమ్మేస్తే తిండి గింజలకు ఇబ్బంది పడాల్సి వస్తుందని అంది."

"అని కాదు. అది అత్తయ్య పొలం కనుక అమ్మ వద్దంది. ఉన్నమాటెందుకు చెప్పవు."

"అలా అని నీ దగ్గర పత్రాలేమయినా ఉంటే చూపెట్టు. పొలంలో విజయ భాగముంటే బామ్మ నడిగి దాని కిచ్చేస్తాను.'

"'సమయమొచ్చినప్పుడు అన్ని పత్రాలూ బయటికొస్తాయిరా. నేను చూస్తూ ఊరుకుంటాననుకోకు."

అలా కోపంతో మొదలెట్టిన అబద్ధం అతనికి కొనసాగించక తప్ప లేదు. అయితే విజయకు అన్యాయం చెయ్యాలన్న ఆలోచన అతనికి లేదు. బామ్మ తదనంతరం ఆమె

వాటా ఆమెకు ఇద్దామనే అనుకున్నాడు. నిజానికి ఆమె తమ దగ్గరే ఉంటున్నది కనుక పంటలో కొంత భాగం చెల్లెలికి ఇవ్వకపోయినా తప్పు కన్పించలేదు అతనికి.

తను విజయవాడ వెళ్ళినప్పుడు పిన్నమ్మతో జరిగిన ఘర్షణ విషయం అక్కకు చెప్పాడు కృష్ణారావు.

'ఇంకేం. నిర్ధారణ అయి పోయినట్లే. అన్న తమ్ములు అది ఆమె ఆస్తి అని ఎక్కడా రాసుకోలేదనే నేను విన్నాను. పత్రాలుంటే కోర్టు కెళ్ళకుండా మానుకునే మనిషి కాదు పిన్ని. ఆ పొలం అమ్మేసెయ్యి, ఆమె వచ్చి మళ్ళీ నిన్నడిగే ఆస్కారం లేకుండా. పొలం నీ హక్కు భుక్తంలో ఉంది కనుక నిన్ను అభ్యంతర పెట్టే వాళ్ళెవరూ లేరు, ఒక్క పిన్ని తప్ప. ఆమె అభ్యంతర పెట్టినా అది చెల్లు బాటవదు" అంది ఇందిర.

అయితే, కృష్ణారావుకు ఆ పొలం అమ్మ మనస్కరించ లేదు. ఒక కారణం- విజయ హక్కును కాదనలేని అతని బలహీనత. అప్పటికేదో కోపంలో పిన్నమ్మతో అబద్ధం చెప్పాడు కానీ, విజయకు అన్యాయ చెయ్యాలని లేదతనికి. రెండు- ఉన్న ఆ కాస్త పొలమూ అమ్మేస్తే తిండి గింజలకూ గడ్డి కరవాల్సి వస్తుంది. తమ్ముడు వెంకటేశ్వర్లకు ఈ విషయం ఉత్తరం రాసి సలహా అడిగితే, "ఆస్తి విషయంలో సలహాలంటూ నాకు ఉత్తరాలు రాయొద్దు. నాన్న చేసిన అప్పు తీర్చాలంటూ పదెకరాలపైన అమ్మావు. వచ్చి రిజిస్ట్రేషనప్పుడు సంతకం చెయ్యటం తప్ప, అమ్మగా వచ్చిన డబ్బులో ఎంత బాకీ కింద జమయిందో, ఎంత వేరు మార్గాలు పట్టిందో ఎవరికి తెల్సు? అక్కయ్యకు కూడా తెల్సు గానీ ఆమెకు నీ పట్ల పక్షపాతం కనుక మాట్లాడకూరుకుందని అహల్య అంది. ఇతరులపై అనవసరంగా నిందలు వేసే తత్వం కాదు దానిది. అందరిలాంటిది కాదది. కనుక, ఈ విషయంలో నేను నీకేం సహాయం చెయ్యలేను" అంటూ జవాబిచ్చాడతను. అహల్య వెంకటేశ్వర్ల భార్య.

ఎట్లా అయినా డబ్బున్న తీరే వేరు. 'సర్వే గుణా: కాంచన మాశ్రయంతి' అన్న ఆ పాతకాలపు నానుడిలో సత్యం లేకపోలేదు. ఆ ఇంటి పెద్దక్క ధనవంతురాలు. కనుక ఆమె మాటకు బంధువర్గంలో కూడా చెల్లుబాటు ఉండేది. 'అది నిక్కచ్చి మనిషి. మాట కఠినమయినా న్యాయంగా ప్రవర్తిస్తుంది' అని ఆమె మేనమామ కూడా అనేవాడు. ఆమె తెనాలిలో ఉండేది. తన పుట్టింటి ఊరు దుగ్గిరాల నుండి పది-పన్నెండు మైళ్ళదూరం. అయితే ఇప్పుడు పిన్నమ్మ విషయం తేల్చుకోటానికి రావటంతో, ఏం చేయాలో తోచక పెద్దక్క దగ్గరకు వెళ్ళాడు కృష్ణారావు.

విషయం చెప్పి, "తప్పేట్టులేదక్కా ఎకరన్నర పొలం విజయ కివ్వక" అన్నాడు.

"దానికేం మాయ రోగం! దాని మొగుడు బాగానే సంపాదిస్తున్నాడు. ఇంకా ఈ పొలం తీసుకుని ఏంచేసుకుంటుంది? ఎవడికో కౌలుకివ్వాల్సిందే కదా? దాని సంగతెలా వున్నా, నువ్వెట్టా బతుకుతావు?" అంది. నిజానికి పెత్తండ్రితో కల్సి తన తండ్రి పంచుకున్న ఆస్తి ఏ మాత్రం తరగలేదు విజయకు. అమ్ముకుని డబ్బు చేసుకున్నారు. రఘురామయ్యే షుగరు ఫాక్టరీ పెట్టి పొలం పోగొట్టుకున్నాడు.

"పిన్ని పొలం పంచివ్వకపోతే కదిలేట్టులేదు. నాకు ఏంచెయ్యాలో తోచటంలేదు" అని చెప్పాడతను.

"సరే పద, నేను వస్తాను" అంది పెద్దక్క

సాయంత్రానికి వాళ్ళు ఊరు చేరారు. అప్పటిదాకా సుందరమ్మ, తోటికోడలు రాజ్యలక్ష్మితోగానీ, కృష్ణారావు భార్య వనజతోగానీ ఆస్తి ప్రస్తావన చెయ్యలేదు. అప్పుడు మొదలయింది ఇద్దరు నాయకురాళ్ళ యుద్ధం.

ఇందిరే ఆ ప్రస్తావన ఎత్తింది, "ఏవిటి పిన్నీ, నీకేదో ఆస్తి రావాలన్నావట!" అని.

"ఔనమ్మా! మీ బామ్మకు ఇద్దరు కొడుకులు. ఆ కొడుకులు పోయినా, ఆమె ఆస్తి వారి పిల్లలకు చెందవల్సిందే కదా? అందుకే అత్తయ్య కున్న మూడెకరాల్లో విజయ వాటా ఇమ్మని కిష్టుడిని అడగవచ్చాను" అంది.

"నేనెప్పుడూ వినలేదే, బామ్మకు సొంతపొలం వున్నట్టు!" అంది ఇందిర.

"పెళ్ళి చేసుకుని పరాయింటి కెళ్ళిన పిల్లలకేం గుర్తుంటుందమ్మా, బామ్మకు పొలముందో లేదో. కిష్టుడినడుగు, వాడు చెప్తాడు" అంది సుందరమ్మ పిన్ని.

"వాడికేం తెల్సు చిన్న వెధవ! నేనీ ఇంటికి పెద్దపిల్లను. మా నాన్న నాకు తెలీకుండా ఏ విషయాలూ గోప్యంగా ఉంచలేదు. నాకు తెలీంది వాడికి తెలిసే అవకాశం లేదు" అంది ఇందిర ఏ మాత్రం బెసగనివ్వకుండా.

"అయితే ఏమిటే, విజయకు న్యాయంగా రావాల్సిన వాటా ఇవ్వకూడదని నిశ్చయించుకున్నారా యేం, మీ అక్కా తమ్ముళ్ళు!" అని గయ్యిమని లేచింది సుందరమ్మ.

బంధువర్గంలో ఆమె నోటికి జడవని వారెవరూ లేరు."అదేమిటి పిన్నీ, అలా మాట్లాడతావు? విజయేం మాకు పరాయిదా? మా బాబాయి కూతురేగా? నా తమ్ముళ్ళూ, చెల్లెళ్ళ లాంటిదే అది కూడా."

"మరింకేం ఇచ్చెయ్యి, దాని వాటా పొలం" అంది పిన్ని కసిగా.

"దానికి వాటావుంటే ఇచ్చెయ్యటానికి మొదటగా ముందుకొచ్చేది కిష్టుడే. చిన్నప్పటి నుండి చూస్తున్నావు, నీకు వాడి సంగతి తెలీదూ?"

అప్పుడు సుందరమ్మకు ఏం మాట్లాడాలో తెలియలేదు. ఆమె ఓపిగ్గా రఘురామయ్య, రాజారావుల ఆస్తి పంపకాల గురించి చెప్పుకుంటూ వచ్చి, "ఏమక్కయ్యా! నువ్వు చెప్పు. పిల్లలకు తెలియక పోతే పోవచ్చు. నీకు తెలియంది కాదుకదా!" అని తోటికోడలు రాజ్యలక్ష్మిని అడిగింది.

"అవున్నిజమే" అంది ఆమె. ఆమె అలా నిజం చెప్పటానికి కారణం తోటికోడలి మీద ఉన్న అభిమానం కాదు, అబద్ధం చెప్పలేని బలహీనత. "అయితే, మేం ఇప్పటిదాకా ఆవిడకు చేసిందానికి విలువలేదా? నువ్వు ఇవ్వాళ వచ్చావు కానీ, ఇన్నేళ్ళనుండి ఆమెకు ఎవరు చేస్తున్నారనుకున్నావు?" అంది ఆమె గట్టిగానే.

సుందరమ్మ దానికి జవాబు చెప్పలేదుకానీ, ఇందిరకు తప్పుకోటానికి అవకాశం దొరకలేదు. "ఇదుగో పిన్నీ, వాళ్ళూ, వీళ్ళూ ఎందుకూ? నీ దగ్గర ఆ పంపకపు పత్రాలేమయినా ఉంటే చూపించి నీ ఆస్తి నువ్వు పట్టుకెళ్ళు" అంది ఆమె.

"పత్రాలుంటే మాత్రం నువ్వు ఇవ్వనిస్తావుటే? నీ నోటి ధాటికి ఎవరు ఆగ గలరు!" అంది ఆమె, కానీ పత్రాలు లేవని మాత్రం అంగీకరించలేదు.

"మరే పిన్నీ, నీ పోలికే నాకు వచ్చినట్టుంది" అంది ఇందిర.

"నువ్వు చెప్పరా, కిష్టుడూ? నీ చెల్లెలికి అన్యాయం చెయ్య దల్చుకున్నానని ఒక్క మాట చెప్పు. నేను నోరు మూసుకుని వెళ్ళిపోతాను" అంది సుందరమ్మ. ఇందిర ఏదో చెప్పబోతే, "అమ్మాయి! ఈ విషయంలో నువ్వు ఇప్పటికే ఎక్కువ మాట్లాడావు. ఇది అన్నదమ్ముల ఆస్తి పంపకాల విషయం. నీకు సంబంధం లేనిది. నువ్వు కలగజేసుకోవద్దు" అంది సుందరమ్మ కటువుగా.

"నాన్న కాలం నుండి మా ఇంటి వ్యవహారాలను చూస్తున్నది అక్కే. అక్కను మాట్లాడొద్దంటే, నేను మాట్లాడ గలిగింది కూడా ఏంలేదు" అన్నాడు కృష్ణారావు.

"సరే పిన్నీ! నువ్వు పెద్దదానివి, మాట్లాడొద్దన్నా నేనేం అనుకోను. అయితే, ఒక మాట! నీ మాటే నిజమనుకుందాం. బామ్మకున్న మూడెకరాల్లో విజయకు ఎకరన్నర రావాలనుకుందాం. ఆస్తి హక్కుకు అదీ, నువ్వూపట్టు బదుతున్నప్పుడు, మరి బామ్మకు మీరేంచేశారని కూడా ప్రశ్నించుకోవాలిగా? నాన్న పోయేంత వరకూ బామ్మ ఇక్కడే వుంది. చిన్న కొడుకని చెప్పి ఒక్క రోజు మీ ఇంట్లో పట్టెడు ముద్ద తింది లేదు. నాన్న పోయి పదేళ్ళయినా, నువ్వు గానీ, విజయగానీ బామ్మను ఒక్క నెలరోజులు ఉంచుకున్నది లేదు.

కిష్టుడు మా ఇంటికి వచ్చి నువ్విలా అడుగుతున్నావని చెప్పినప్పుడు, మా వారే అన్నారు - అలాంటిది, మీపిన్ని ఏ ముహం పెట్టుకునివచ్చింది, వాటా ఇవ్వమని అడగటానికి- అని. కనీసం ఇప్పుడయినా బామ్మను తీసుకెళ్ళి నాలుగు రోజులు అట్టి పెట్టుకో, ఆ తర్వాత వచ్చి ఆస్తి ఇమ్మని అడుగు. చూసే వాళ్ళకు కూడా అది సమంజస మనిపిస్తుంది."

"తిన్నారు కనుక చేశారు. మా వంతు పొలంలో కూడా ఫలసాయం అనుభవించలా? మా కేమయినా ఇచ్చారా? చేసిందానికీ, తిన్నదానికీ చెల్లు."

"అలా నువ్వంటే మేం మళ్ళా పాత పాటే పాడవల్సి వస్తుంది బామ్మకు వేరే ఆస్తి ఏదీలేదని. నువ్వామెని కొన్నాళ్ళుతీసుకెళ్ళి ఆమె సంరక్షణ బాధ్యత వహించు. అప్పుడు చెప్పు నీకు వాటా రావాలని."

"అట్లాగే" అంది పిన్ని.

ఇద్దరివీ ఇసుక తక్కెడ, పేడ తక్కెడ ఆలోచనలే. ఇందిరది వాయిదా వేసే ఆలోచన అయితే, అత్తను నాలుగు రోజులుంచు కున్నాక మరింత గట్టిగా తన వాదం విన్పించవచ్చు అన్న ఆలోచన సుందరమ్మది.

ఆ మర్నాడు మధ్యాహ్నం మూడింటికని పెట్టారు మహూర్తం, పార్వతమ్మ నిర్గమనానికి. ఆమె ఎప్పటిలానే పొద్దున్నే లేచింది. కొడుకు పోయినాక ఆమెకు డ్యూటీలేర్పడ్డాయి. పొద్దున్నే అంట్లుతోమాలి. చిన్న పిల్లలకు చద్దన్నాలు పెట్టాలి. ఆమెకు పెద్ద కోడలు రాజ్యలక్ష్మికి పడదు. ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోరు. కుక్క మీదో, పిల్లిమీదో పెట్టితిట్టుకుంటారు.

తన పనయ్యాక, స్నానం చేసి జపానికి కూర్చుంటే, మళ్ళా లేచేటప్పటికి అపరాహ్ణమయేది. ఎప్పటిలాగానే పార్వతమ్మ జపానికి కూర్చుంది కానీ, ధ్యానంలో మనసు లగ్నం చేయ లేక పోయింది. అలాంటి మానసిక స్థాయిని గురించి కబీరుదాసు ఎప్పుడో చెప్పాడు:

'మాలా తొ కర్ మే ఫిరై, జీభ్ ఫిరై ముఖ మాహి
మన్వా తొ దశదిశీ ఫిరై, యహ్ తొ సుమిరన్ నాహి' అని.

కుదురు చెడిపోయిన ఆమె మనసు పరి పరి విధాల పోయింది. 'తన చిన్న కోడలు సుందరమ్మ- బాలాత్రిపుర సుందరి- తనకు స్వయానా మేనకోడలే. తమ్ముడి కూతురని చేసుకున్నది కానీ ఆమె తనను కొడుకింటికి రానిచ్చింది లేదు. ఆ మాట కొస్తే పెద్దకోడలే నయం. తమ ఇద్దరికీ పడదు కానీ, తన్ను ఆ ఇంటి మనిషిగానే చూస్తుంది తప్ప పరాయి మనిషిగా కాదు. సుందరి కూతురి ఇంట్లో ఉంటున్నది. ఆమె అల్లుడికి తన ఇంట్లో అత్త

ఉండటమే ఇష్ట ముండదు. అలాంటప్పుడు అత్తకు అత్త కూడా వచ్చి తన ఇంట్లో తిష్ఠవేస్తే సహిస్తాడా? తన మనవరాలు విజయ ఎప్పుడో తన్ను చుట్టపు చూపుగా చూడటం తప్ప, పెద్ద కొడుకు పిల్లల్లాగా ప్రేమగా ఉండేదికాదు. తనంటే ఎవరికీ పడని ఇంట్లో తన జీవిత చరమాంకం గడపాలా?' ఆ ఊహే ఆమెకు దుర్భర మన్పించింది. 'తను ఆ ఇంట్లో అడుగు పెట్టి ఎనభై ఐదేళ్ళయింది. తనకు పదకొండేళ్ళప్పుడు ఆ పెద్ద అరుగుల ఇంటికి కాపురానికి వచ్చింది. వీధిన పోయే బాటసారులు సేద తీర్చుకోటానికి, తన మామ పూర్వీకుడెవరో ఆ అరుగులు కట్టించాడు. అయితే ఇంటిలోని మనుషులకంత విశాల హృదయం లేదు. తన మొగుడి కప్పుడు ఇరవైయేళ్ళ వయసు. ఊళ్ళో తండ్రి పెద్ద రైతు. ఎకరాల ఎకరాల భూములుండేవి వాళ్ళ పేరున. కొడుకంటే గారాబం తండ్రికి. ఇంట్లో చిన్న అశ్వశాల ఉండేది. తండ్రీ, కొడుకూ చెరో గుర్రం మీదా ఊరేగేవారు. ఎక్కడెక్కడో చెడ తిరిగి వచ్చేవారు. ఎందరు ఉంపుడుగత్తెలు ఉంటే అంత గుర్తింపు ఆనాటి సమాజంలో. తను కాపరానికొచ్చిన సంవత్సరం లోపలే తన మామ చనిపోయాడు. అత్త తన్ను తిట్టిపోసింది– కొత్త కోడలూ, కొత్త గొడ్డూ అంటూ. ఆ ఇంట్లో గొడ్డు స్థాయి కంటే మించిన స్థాయి కాదు తనది. ఇంటెడు బండ చాకిరీ చేసినందుకు, పశువుకు మేత వేసినట్లే తనకూ ఇంత తిండి పడేసేది తన అత్త. మామ చని పోయాక తన భర్త తిరుగుళ్ళకు అంతు లేకుండా పోయింది. తనకు శ్రీరామచంద్రుడు ఆదర్శం. అట్లా పెంచారు తన తల్లిదండ్రులు.

'ఎప్పుడో అర్ధరాత్రి వచ్చేవాడు తన మొగుడు. తమకంతో తనను పెనవేసుకు పోయేవాడు. తన ఇష్టాయిష్టాల నిమిత్తం లేదక్కడ. అక్కర తీర్చుకుని వెళ్ళి పడుకుని నిద్రపోయేవాడు. ఓసారి ఎవత్తెగ్గరో పడుకుని వచ్చాడు. మనిషి దగ్గరకు రాగానే తనకు కంపరమెత్తింది. "నేనుండగా నీకీ తిరుగుళ్ళెందుకు?" అని అడిగింది తను. "ప్రశ్నలెయ్యకు. మొగుడికిష్టమయిన రీతిలో ప్రవర్తించటమే ఆడదాని కర్తవ్యం. నేను ఎక్కడ తిరిగితే నీకెందుకు? ఎక్కడ తిరిగినా పట్టమహిషి స్థాయి ఉంపుడుగత్తె కొస్తుందా?" అని నవ్వి తన్ను ఉబ్బేయటానికి ప్రయత్నించాడు. "నువ్విట్లా చేస్తే నేను మా పుట్టింటికి పోతాను" అని తను మూర్ఖంగా బెదిరించింది. 'రేప్పొద్దునే పంపిస్తాను, సిద్ధంగా ఉండు" అని మళ్ళీ ఏ ఉంపుడుగత్తె ఇంటికో వెళ్ళిపోయాడు. అతనన్నట్టే మధ్యాహ్నానికల్లా మేనా సిద్ధమయింది. తన్ను పుట్టింటికి పంపేశాడు. తన తల్లి తన్ను ముక్క చీవాట్లూ పెట్టింది. "మొగుడితోనే చావైనా, బతుకైనా" అంది. మర్నాడు తండ్రి వచ్చి తన్ను దింపాడు. తన మొగుడు మధ్యాహ్నానికి భోజనానికింటి కొచ్చినవాడు తన తండ్రితో ఏం మాట్లాడాడో తనకు తెలీదు. గదిలోకొచ్చి, "ఏం వచ్చేశావు?" అని అడిగి, తను జవాబు చెప్పక

ముందే ఈడ్చి, తన చెంప పగలగొట్టాడు. "అర్థమయిందిగా? ఈ ప్రపంచంలో నీ కెక్కడా నిలువ నీడ లేదు, ఇక్కడ తప్ప, అదీ నేను అనుగ్రహిస్తే తప్ప. ఇక్కడ నుండి వెళ్ళటం సంభవిస్తే అది కాటికే, గుర్తుంచుకో" అని ఆ పూట ఇంట్లో అన్నం తినకుండా కోపంగా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత తను ఇల్లు దాటింది లేదు. ఇంక కాటికే వెళ్ళటం అని నిశ్చయం చేసుకుని ఉంటే, ఇప్పుడీ స్థాన చలనం కలుగుతోంది. తన నిష్క్రమణకు ఎప్పుడు అనుమతిస్తాడో ఆ పరమాత్ముడు!

'అత్త పోయింది, మొగుడు పోయాడు. కొడుకుల హయాంలో తనంత ఇబ్బంది పడింది లేదు. తమ తండ్రి చేతిలో తల్లెంత బాధ పడిందో వాళ్ళకు తెల్సు. అందుకే ఇద్దరు కొడుకుల్లో ఎవరూ తన మాట కాదన్నవాళ్ళు కాదు. కోడళ్ళతో తనకు పడకపోయినా తను పెద్దగా బాధ పడింది లేదు. చిన్న కొడుకు బతికున్నప్పుడు తన్ను ఓ నెల రోజుల పాటయినా తీసుకెళ్ళి ఉంచుకోవాలనుకునే వాడు. కానీ, సుందరి పడనిచ్చేది కాదు. "ఆవిడది నిప్పులు కడుక్కునే ఆచారం.నా వల్లకాదు ఆమెకు చేయటం" అనేది. తన కొడుకు పెళ్ళానికి జవాబు చెప్పలేని మనిషి. తనెప్పుడయినా వినుకొండ రావాలని ఉత్సాహ పడినా, "నీ కక్కడ ఆచారం అదీ బాగా సాగదే. అన్నయ్య దగ్గరే ఉండు" అని చెప్పేవాడు కానీ, పెళ్ళాం దగ్గర తన మాటలు సాగవని చెప్పేవాడు కాదు. అలా అప్పుడు తన ఉనికినే భరించలేని తన మేనకోడలు, బాలా త్రిపుర సుందరి, తన్ను తీసుకు వెళ్తా నంటోంది. తన మనసు, శరీరం ఆమెతో వెళ్ళ తిరస్కరిస్తున్నాయి. ఏం చెప్పి, మనవడు కిష్టుడి మాట కాదనాలి. తను వెళ్ళనంటే వాడు బాధపడతాడు. తన్ను బలవంతానయితే పంపించడు. తనేం చేయాలి?

'తన్ను కన్నవాళ్ళు పోయారు. కట్టుకున్నవాడు పోయాడు. తను కన్నవాళ్ళూ ఒక్కొక్కళ్ళూ పోతూంటే తన మనసు కకావికలై, తను నిస్సహయ స్థితికి చేరుకుంది. అప్పటినుండే తను క్రమంగా ప్రపంచాన్నుండి ఉపసంహరించుకునే ప్రయత్నం చేసింది. అయినా తన ఉనికి ప్రమాద భరితంగామారింది. తనేం చేయగలదు? తనకు చావు రాకుండా ఉంది. ఎవరికీ అక్కర్లేదు తను. ఎప్పుడో పోవల్సింది' అనుకుంటే, ఒక్కసారిగా ఏడుపు ముంచు కొచ్చినట్టయి, గుండె కలుక్కుమంది. ఎక్కడెక్కడెక్కడకో తనుపోతున్నట్ట నిపించింది ఆమెకు. తన్ను కన్నవాళ్ళు, తను కన్నవాళ్ళూ ఒకసారి మనసులో మెదిలారు. వాళ్ళందరితోనూ బంధాలెప్పుడో తెగి పోయాయి. తన ప్రాణతంతువు తెగి పోయినట్లని పించిదామెకు. ఆ నీలకంఠుడే ఆమెకు దృశించాడు. 'శివ శివా, హరోం హర' అని ఆమె గుండె ఘోషించి, జీవన తంతువును తెంపే ప్రయత్నం చేసింది.

'ఎంతసేపే మీ బామ్మ జపం? భోంచేసి, ఓ కునుకు తీస్తేగానీ ప్రయాణం చెయ్యలేను నేను" అంది అరవయ్యేళ్ళ సుందరమ్మ ఇందిరతో.

ఇందిర కేదో అనుమానమొచ్చింది. సాధారణంగా బామ్మ జపం పన్నెండు గంటలకల్లా అయిపోయేది. ఒంటి గంటయినా ఆమె లేవక పోయేసరికి, తాము ఆమెను తన ఇష్టానికి వ్యతిరేకంగా పంపిస్తున్నందుకు అలా నిరసన తెలియబరుస్తున్నదా అన్న అనుమానమొచ్చి, "బామ్మా!" అని పిలిచింది కానీ, ఆమెకు మనవరాలి మాటలు వినపడలేదు. నాలుగుసార్లు పిల్చినా ఆమె పలకకపోయేసరికి ఆమె మనసు కీడు శంకించింది. బామ్మ మడిలో ఉంది కనుక తను తాక రాదు. అందుకే తల్లిని పిల్చి, "చూడవే అమ్మా! బామ్మ పలకటం లేదు" అంది.

రాజ్యలక్ష్మివచ్చి, "అత్తయ్యా!" అని భుజం మీద చెయ్యేసే సరికి, పార్వతమ్మ పక్కకి ఒరిగింది. ఒక్క క్షణం ఆమె మనసు ఖిన్నమయింది.

"కృష్ణ! కృష్ణ! మీ బామ్మ లేదిక, పోయినట్లుంది."

"పాపిష్టిదాన్ని! ఆమెను పంపిచెయ్యాలని పట్టుబట్టి ఆ పాపం మూటకట్టుకున్నాను నేను. బామ్మ శాశ్వతంగా వెళ్ళిపోయింది" అని వెక్కి వెక్కి ఏడ్చింది ఇందిర.

అందరూ గొల్లుమన్నారు. అత్త చచ్చి తన ప్రయాణాన్ని మరోరోజు వాయిదా వేసి నందుకు సుందరమ్మ మనసులో విసుక్కుంది. ఆమెకు తనంటే ఎప్పుడూ పడదు.

కృష్ణారావు గుండె కలుక్కుమంది. క్రితం సాయంత్రం 'నన్ను పంపేస్తున్నావటరా?' అని ఆమె అడిగినపుడే అతని మనస్సు బాధపడింది. సమాజంలో స్త్రీకి జరిగే అన్యాయం పట్ల అతని హృదయం కలుక్కుమంటూనే ఉంటుంది. 'తన్నోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా' అని ద్వాపరయుగంలో ప్రశ్నించే స్వాతంత్ర్యం ఉన్న ద్రౌపది క్కూడా న్యాయం జరగలేదు. ఆ తర్వాత, స్త్రీకి ఆ స్పృహ కూడా లేకుండా చేశారు. అలా ఆలోచిస్తున్న కృష్ణారావు మనసులో ఓ అనుమానంతలెత్తింది, 'బామ్మ పోవటంవల్ల చెల్లెలికి ఎకరన్నర కట్టబెట్టాల్సి వస్తుందని తనమనసు కలతబార లేదుకదా?' అని. 'లేదు, తనంత కఠినాత్ముడు కాదు' అని మనసును సర్ది పెట్టుకోజూసినా, 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అన్న తన చేతన అతని మానసాన్ని గుచ్చినట్టనిపించింది. ఆదర్శాలు వేరు, బతుకు వేరు. రెండింటినీ అనుసంధించ గలగటం తేలికయిన విషయం కాదు. అయితే కొన్నాళ్ళయినా బామ్మ ఆస్తిని తన అధీనంలో ఉంచుకునే ప్రయత్నంలో ఆమెను తన ఇంటినుండి పంపే ఆలోచనకు ఊతమిచ్చాడు కానీ, మనసుకు సర్ది చెప్పుకోగల ఊతం లేక పోయింది అతనికి. లేచి నిలబడబోయి తొట్రు పడ్డాడతను. ప్రకృతి సహజంగానే

స్పందనాశీలుడతను. భౌతికవాది. ఆధ్యాత్మికత భౌతికవాదానికి ఊతమిస్తుందని అతడింకా తెలుసుకోలేదు.

అంతలో పార్వతమ్మ నిర్జీవ శరీరంలో చేతన కలిగింది.

అందరికీ ఆశ్చర్యం కలిగింది.

ఆమె తేరుకుంటూనే "సుందరీ!" అని పిల్చింది.

ఆమెరాగానే, "నా పేర పొలం ఉన్నట్టు నాకు తెలీదు. నువ్వెలా ఉందనుకున్నావు? నాకు లేని పొలంలో వాటానా?" అని అడిగింది.

"ఆస్తి పంచుకోటం అయి ఇంటికొచ్చాక మీ అబ్బాయే నాకు చెప్పారు, మూడెకరాల పొలం నీ పేర పెట్టినట్టు. పక్షపాత బుద్ధితో నువ్వు అబద్ధమాడొచ్చుగానీ ఆయనెందుకు చెబుతారు అలా?" అంది సుందరమ్మ.

"అయితే నాకు ఆస్తి ఉన్నమాట నిజమేనన్నమాట!"

"అవును. ఉంది" అని నిశ్చయంగా చెప్తూ తలూపింది సుందరమ్మ.

"నేను బతికే ఉన్నానా, చచ్చానా?"

"అదేం మాట, అత్తా, నిక్షేపంలా బతికే ఉన్నావు."

"నేను బతికి ఉండగానే, నా ఆస్తి పంపకాల ప్రసక్తి ఎందుకూ? ఒరే కిష్టుడూ, నా పొలం సాగుచెయ్యి. నాకేదోచేశానని తెగ ఆయాస పడిపోతూందిగా మీ అమ్మ. నాకు చాకిరీ చేసిన దాని కింద, నా తిండికి పోను మిగతా పంట దాని కిచ్చెయ్యి. సుందరీ, ఇంక ఆస్తి పంపకమంటూ, నేను బతికుండగా ఇక్కడకు రావద్దు" అంటూ గోడ ఊతం తీసుకుని లేచి నిలబడ ప్రయత్నించి పడిపోయింది పార్వతమ్మ. కృష్ణారావు ఆమెను ఎత్తుకుతీసుకు వెళ్ళి ఆమె మంచంమీద పడుకోబెట్టాడు. ఆమె నిస్త్రాణగా పడుకునుండి పోయింది. ఇంటిల్లిపాదీ బామ్మకేమయిందా అని గాబరా పడిపోయారు.

అత్త మంచాన పడితే తన పాట్లెలాగా అని దిగాలుగా కూర్చుండి పోయింది రాజ్యలక్ష్మి.

"పాపీ చిరాయువని, ఆవిడప్పుడే ఎక్కడ పోతుందీ? నా కన్నం పెట్టక్కా, నేను వెళ్ళిపోవాలి" అంది సుందరమ్మ.

"నీకేం హాయిగా వెళ్ళిపోతావు. ఆవిడ మంచాన పడితే చెయ్యలేక నేను చావాలి. తొందరేం, ఆవిడ లేచి తిరుగుతుంటే చూసి వెళ్ళొచ్చుగా?" అంది రాజ్యలక్ష్మి.

"నాకేం సంబంధం లేదమ్మా, మీరూ మీరూ చూసుకోండి. నన్ను రావొద్దందిగా ముసల్ది!"

భోజనం చేశాక విజయవాడకు వెళ్ళబోతూ, సంచీ చేత పట్టుకుని అత్త గదిలోకి

వెళ్ళింది సుందరమ్మ. పార్వతమ్మ కళ్ళు మూసుకుని పడుకుని ఉంది. చిన్న కోడలు వచ్చిన అలికిడి విని ఆమె కళ్ళు తెరిచింది.

"వెళ్తాను. నువ్వు చచ్చినా మళ్ళీ ఈ కొంపలో అడుగు పెట్టను" అంది సుందరమ్మ కసిగా.

"అందరం పోయేవాళ్ళమే. ఇక్కడ ఉట్టి కట్టుకుని ఊరేగేవాళ్ళెవరూ? ఇవాళ, రేపు -అంతే తేడా" అంది అత్త.

"కాటికి కాళ్ళు చాచుకున్నావు గానీ, పొగరు మాత్రం చావలేదు, అత్తా!" అంది సుందరమ్మ.

"నీకు స్వయానా మేనత్తను కదుటే మరి!" అని చిన్న కోడలికి సమాధానం చెప్పి, నిస్త్రాణగా కళ్ళు మూసుకుంది పార్వతమ్మ.

సుందరమ్మను బస్సు ఎక్కించి వచ్చాడు కృష్ణారావు. భోజనాలయ్యాయి. ముసలమ్మ అభోజనంగానే పడుకునుండి పోయింది. బామ్మ కాస్తంత తేరుకున్నట్టు కన్పిస్తే, ఇందిర కూడ సాయంత్రం తెనాలి వెళ్ళి పోయింది. రాత్రయేసరికిమగత కమ్మింది ఆమెను. రాత్రికి అత్త పక్కనే చాప పరుచుకని పడుకుంది రాజ్యలక్ష్మి, ఆమెకేమన్నా అవసరపడుతుందేమో నని.

అర్ధరాత్రి అత్త పిలుస్తున్నట్టుంటే మెలకువ వచ్చింది రాజ్యలక్ష్మికి. లైటు స్విచ్ వేసి ఆమె దగ్గరకు వెళ్ళింది. తనమంచం క్రింద ఉన్న పెట్టె బయటకు లాగమంది పార్వతమ్మ. ఆ పెట్టెను ఆమెను కాపురానికి పంపేటప్పుడు ఆమె తండ్రి కొనిచ్చాడు. ఆమె దాన్ని అపురూపంగా చూసుకుంటుంది. తన తలగడ క్రింద ఉన్న తాళం చెవిని మెల్లగా తీసిచ్చి పెట్టె తెరవమంది.

అత్తకేమన్నా మతి పోయిందా అనుకుంది కోడలు.

"ఇప్పుడు అదెందుకూ?" అంది విసుక్కుంటూ.

"తెరవమన్నానా?" అంది నీరసంగా కసురుకుంటూ పార్వతమ్మ.

రాజ్యలక్ష్మి పెట్టె తెరిచింది. అందులో తన పుట్టింటివారు పెట్టిన పట్టు చీరెలు, వెండి కాలి పట్టాలు వగైరా పాత సామానులున్నాయి. పార్వతమ్మ చెప్పిన మీదట వెతికి, చీరెల కింద ఉన్న ఓ పాత కాలపు దస్తావేజు కాయితాన్ని బయటకు తీసింది. అది ఆమెకొడుకులు రఘురామయ్య, రాజారావు తల్లి పొలం విషయమై రాసుకున్న పత్రం.

దాన్ని బయటకు తీశాక, "రాజమ్మా, చదువుతావు కదే? ఇది నీ మొగుడు కూడా సంతకం చేసిన పత్రం. అన్న దమ్ములు ఏం రాసుకున్నారో చదువు."

రాజ్యలక్ష్మి ఆశ్చర్యపోయింది. లేదు లేదనుకుంటున్న పత్రం అత్త దగ్గరే ఉందన్నమాట! లేచి పక్క గదిలోకి వెళ్ళి తన అల్మారాలో నుండి కళ్ళజోడు తెచ్చుకుని చదివింది. తన భర్త స్వహస్తాలతో రాసిన దస్తావేజు అది. ముత్యాలకోవ లాంటి దస్తూరీ. అందులోని ముఖ్య భాగం ఇలా పైకి చదివింది రాజ్యలక్ష్మి.

"మా అమ్మగారు బతికి ఉన్నంతకాలం ఈ పొలంలో వచ్చే అయివేజుతో ఆమె ఎలాంటి కష్టం కలగకుండా బతకాలని ఆమె పుత్రుల మయిన మేము ఆశిస్తూ ఆమె పేరున మేమీ పొలంలోని వాపీ, కూప, నిక్షేపాదులన్నిటిని అనుభవించే హక్కులతో ఆమెకు దఖలు పర్చటం జరుగుతున్నది. ఆమె తదనంతరం ఆ పొలం మా అన్నదమ్ముల పిల్లలకు చెందుతుంది."

"ఇదేంటి అత్తయ్యా, మీ దగ్గర కాయితం ఉంచుకునే...."

రాజ్యలక్ష్మి మాటలను పూర్తిచెయ్యనివ్వలేదు పార్వతమ్మ.

"నాకు కిష్టుడెంతో, విజయమ్మ అంతే. పక్షపాతం అనుకుంటుంది దాని తల్లి. ఒకప్పుడు నా ఆస్తి నా కొడుకుల పిల్లలిద్దరికీ చెందాలని అనుకున్నాను. కానీ, విజయకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందీ లేదు. కిష్టుడు డబ్బులేక ఇబ్బంది పడిపోతున్నాడు. అయినా మీరెవరూ నన్ను పరాయిదానిలా భావించలేదు. ఉన్నదాంట్లోనే పెట్టారు. ఇలాంటప్పుడు హక్కు ఉంది కనుక దానికి ఆస్తి అప్పగించటాన్ని దేవుఁడు కూడ హర్షించడు. ఆ కాయితం ఇలా తే" అని కోడలిచ్చిన దస్తావేజును తీసుకుని, కొడుకుల సంతకాలపై ఒకసారి ముద్దు పెట్టుకుని, ఆ కాయితాన్ని ముక్కలు ముక్కలుగా చించేసింది.

"అయ్యో, అదేమిటలా....?" అని వారించబోయిన రాజ్యలక్ష్మి చేతిలో కాయితపు ముక్కలు పెట్టింది పార్వతమ్మ.

"ఇది నాతోనే దహనమయిపోవాలి. నువ్వు ఈ విషయం ఎవరికీ చెప్పనని ఒట్టు వెయ్యి.... ఊఁ, వెయ్యి!"

ఆమె సందేహిస్తూనే చేతిలో చెయ్యి వేశాక, "పత్రంలేదు, నాకు పొలం లేదు. నీ చిన్నప్పుడెప్పుడో నిన్ను నా ఇంటికి తెచ్చుకున్నాను. తిట్టానో, తిమ్మానో, నేను ఈ ఇంటి మనిషిని కాదని నువ్వనుకోలేదు. పోయే ముందయినా నీ స్నేహాన్ని గుర్తించక పోతే ఎలా? జీవితంలో చేసిన ఎన్నో తప్పుల్లో ఇదొకటి. ఎన్నింటికని దేవుఁడికి క్షమాపణలు చెప్పుకునేది! వెళ్తున్నా నమ్మాయి.!...వెళ్తా" అంటూనే కోడలు పట్టుకున్న చేతిని వదిలేసి, ప్రాణాలు విడిచేసింది పార్వతమ్మ.

రాజ్యలక్ష్మి గొల్లుమంది. ఇంట్లో వాళ్ళందరూ లేచారు.

'భవ బంధాలంటూ, భౌతిక జీవితాన్ని నిరసిస్తూ, ఆధ్యాత్మిక చింతనలో గడుప ప్రయత్నించిన తన బామ్మకు కూడా, తన భౌతిక వివశత నుండి గట్టెక్కటానికి, అదే భౌతిక ఆర్థిక సంబంధం అవలంబన మవాల్సి రావటం విచిత్రం! కంటికి కన్పించే దాన్ని కాదని ఎలా బతకటం! తనకోసం ఆమె ఏమీ కోరుకోలేదు. బతకాలి కనుక ఒకపూట రెండు ముద్దలు తినేది. నిత్యం పరమాత్మ చింతనలోనే గడిపింది. అలాంటి ఆమెకు కూడా జీవితంలో ఎప్పుడూ చెయ్యని, 'నా ఆస్తి' ప్రస్తావన చెయ్యక తప్పలేదు. ఇహ చింతన తను నడిచేందుకు ఆసరా ఇచ్చే చేతి కర్ర లాంటి దయింది ఆమెకు. అంతకు మించిన విలువ ఆమె ఎప్పుడూ దానికి ఇవ్వ లేదు. నిన్నా దాని ఉనికిని గమనించకతప్ప లేదు, ఆమెకు. ఆ 'చేతి కర్ర' లేకపోతే ఆమె భౌతిక చలనం, నడక సాధ్యమయేది కాదు' అనుకున్నాడు మనవడు కృష్ణారావు బామ్మ చేతి కర్రను కూడా ఆమె పార్థివ శరీరాన్ని దహిస్తున్న అగ్ని జ్వాలలో పడేస్తూ.

బామ్మ చనిపోయింది కనుక విజయకు పొలంలో భాగం పెట్టక తప్పదు. తనెలా బతకాలో ఆలోచిస్తేనే భయంమేసింది అతనికి. తరువాత బామ్మ కసలు ఆస్తి లేదట ఆ విషయం తనకు బామ్మే పోయే ముందు చెప్పిందని తన తల్లి నమ్మబలుకుతుందనీ, తనకు అలా నిలదొక్కుకునేందుకు ఊతం లభిస్తుందనీ అతనికి తెలియదు.

రచన మాస పత్రిక, జులై 2012